www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



పర్యావరణ పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగర వనాల నిర్మాణంతో పర్యావరణ పరిరక్షణ సాధించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం స్థానిక అక్కచెరువు పాడు, పొదలకూరు రోడ్డు నగర వనం, అల్లీపురం ప్రాంతాల్లోని అటవీ భూములను కమిషనర్, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ రావుతో కలిసి పరిశీలించారు.

కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో జీవ వైవిధ్యాన్ని పెంపొం దించేందుకు అటవీ భూములలో వివిధ రకాల మొక్కలను సంరక్షించేలా ప్రణాళికలు రూపొం దిస్తున్నా మన్నారు. తక్కువ నీటిని గ్రహించుకుని, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే మొక్క జాతులను నగర వ్యాప్తంగా విరివిగా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ సంజయ్, ఉద్యాన శాఖ అధికారి ప్రదీప్ కుమార్, ఫారెస్ట్ రేంజర్ అధికారి ఉన్నారు.

'చినుకు' దోబుచులాట..!

- మూడు రోజులుగా మసకేసింది
- చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ ఛిద్రం
- భూగర్భ జలాలు నామ మాత్రం

బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణ, ఎపిలలోని పలు జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తోన్నాయి. జిల్లాలో మాత్రం చినుకు దోబుచులాట ఆడుతోంది. మూడ్రోజుల నుంచి మసకేసినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. చిన్నపాటి జల్లులు మాత్రమే అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఈ చిన్నపాటి వర్షానికే జిల్లా వ్యాపితంగా రోడ్లు ధ్వంసమయ్యాయి. 2021-22 సంవత్సరం 1303మి.మి. వర్షపాదం నమోదైంది. సాధారణ వర్షపాతం 1080 కాగ అదనంగా 20.7 మి.మి. నమోదైంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం 1052 కాగ, ఇప్పటి వరకు 1075 మి.మి. 2.1 మి.మి.మాత్రమే ఉంది. జిల్లా వ్యాపితంగా 38 మండలాల్లో 5 మండలాల్లో ఎక్కువగా ఉంది. 14 మండలాల్లో సాధారణ, 13 మండలాల్లో అతితక్కువ, 6 మండలాల్లో నీటి కొరత ఉంది.అక్టోబర్, సెప్టెంబర్‌లలో వర్షాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది.

చిన్నపాటి వర్షానికే ఛిద్రమైన రోడ్డు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుతం వాతావరణలో అనేక అసాధరణ మార్పులు కనిపిస్తున్నాయి. అకాల వర్షాలు, తుపాన్లతోపాటు, అతిగా ఉష్ణోగ్రతలు నెలకొం టున్నాయి. జనం మారుతోన్న వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక పోతున్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎండలు నమోదయ్యాయి. వాతావరణలో తేమ శాతం భారీగా తగ్గిపోవడడంతో వడగాలులు వీచాయి. వడదెబ్బలతో ఆస్పత్రుల్లో చేరారు. మార్చి, ఏప్రిల్, మేలలో ఊహించని ఉష్ణోగ్రతలు వచ్చాయి. ఇదే సమయంలో అప్పుడప్పుడు అకాల వర్షాలు రైతులను దెబ్బతీశాయి. గాలులతో మామిడి, అరటి, పొగాకు వంటలు దెబ్బతిన్నాయి. గత మూడు నెలల కాలంలో 40 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అసాధారణ ఉష్ణోగ్రతలతో పనులు నత్తనడకన సాగాయి. జూన్, జులై లలో వర్షాలు వచ్చి కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలునమోదు కాలేదు.

చినుకు దోబుచులాట..!

రుతుపవనాలు మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. ప్రతేడాది జూన్ జులైలలో భారీగా వర్షాలు వస్తాయి. కేరళ నుంచి రుతుపవనాలు రావాల్సిఉండగా ఆచూకీ కనిపించడం లేదు. బంగాళఖాతంలో అల్పపీడనం వల్ల తెలంగాణ, ఎపిలో కొన్ని జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కరుస్తోన్నాయి. జిల్లాలో మాత్రం అడపా,దడపా చినుకులు మాత్రమే పడుతున్నాయి. జిల్లాలోని 38 మండలాల్లో వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐదు మండలాల్లో 20 శాతం వర్షం పడినట్లు రికార్డులు చెబుతున్నాయి. సాధారణ వర్షపాతం 14 మండలాల్లో పడింది. 13 మండలాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. ఆరు మండలాల్లో వర్షం కనిపించలేదు. ఈ ఏడాది జులై నాటికి-20 శాతం తక్కువ వర్షపాతం ఉంది. విడవలూరు, కొడవలూరు, వెంకటాచలం, కందుకూరు, ఉలవపాడు, మండలాల్లో మాత్రమే వర్షపాతం ఎక్కువగా నమోదైయింది. మిగిలిన 32 మండలాల్లో వర్షాపాతం అటు, ఇటుగా ఉంది. మూడ్రోజుల నుంచి రాష్ట్ర వ్యాపితంగా వర్షాలు కురుస్తున్నా నెల్లూరులో మాత్రం భారీగా వర్షాలు పడడం లేదు. కేవలం చిరుజల్లులు, మబ్బువేయడం మినహా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. పెన్నా, స్వర్ణముఖి, పంబలేరు, మామిడి కాలువ ఎక్కడా నదుల్లో నీరు లేదు. భూగర్భ జలాలు పెరగలేదు. సెప్టెంబర్, అక్టోబర్‌లలో వచ్చే వర్షాలపైనే జిల్లా ప్రజలు ఆశలు పెట్టు కున్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాల తోపాటు అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని వాతావరణశాఖ హెచ్చరించింది.

చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ ఛిద్రం..!

జిల్లాలో మూడు రోజుల నుంచి చిన్నపాటి వర్షాలు పడుతున్నాయి. దీనికే రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. నగరంలోని అపోలో ఆసుపత్రి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్లలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. డ్రెయినేజీ దెబ్బతిని మ్యాన్‌హోల్ నోళ్లు తెరుచుకుంటున్నాయి. కొద్దిపాటి నీరు చేరితో అందులో పడే ప్రమాదం కనిపిస్తోంది. నగరంలోని నిప్పోవద్ద రోడ్డు చిన్నపాటి పిల్ల కాలువలా కనిపిస్తోంది. నెల్లూరు రూరల్ మండలంలోని జొన్నవాడ, నరసింహకొండ, రోడ్లు 27 కిలో మీటర్లు ప్రమాదకరంగా మారాయి. ఇవే కాకుండా జిల్లాలోని అనేక రోడ్లు, డ్రెయినేజీలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు వస్తే మరింత దారుణంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రమాదంగా మారుతుంది.

నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నోరు తెరుచుకున్న మ్యాన్‌హోల్

రొట్టెల పండుగ నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని బారాషాహీద్ దర్గాలో ఈ నెల 29వ తేదీ నుంచి ఐదు రోజులు జరిగే రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం హరి నారాయణన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఎస్.పి తిరుమలేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ లతో కలసి బారా షాహీద్ దర్గాను సందర్శించి రొట్టెల పండుగ సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత కలెక్టర్ దర్గా ప్రదేశాన్ని పరిశీలించి భక్తుల క్యూ లైన్ల ఏర్పాట్ల వివరాలను దర్గా అభివద్ధి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సలహా ఇచ్చారు. అనంతరం కలెక్టర్, స్వర్ణాల చెరువు ఘాట్ ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 29 వ తేదీ నుండి అయిదు రోజుల పాటు జరగనున్న రొట్టెల పండుగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రొట్టెల పండుగ జరుగు అయిదు రోజులు పారిశుద్ధ్య ఏర్పాట్లు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్పోరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్‌పి డాక్టర్ కె. తిరుమలేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుకుండా పర్యవేక్షించేందుకు 2,500 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. పార్కింగ్ ప్రదేశాలు వెళ్ళే రూట్ మ్యాప్ లను రొట్టెల పండగకు వచ్చే భక్తులకు తెలిసేలా ప్రధాన కూడళ్ళ వద్ద, రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తున్నా మన్నారు. లెక్టర్ హరి నారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ తో కలసి పొదలకూరు రోడ్డు, తెలుగుగంగ కాలనీ లోని ప్రసార భారతి కార్యాల యం వద్ద ఏర్పాటుచేస్తున్న పార్కింగ్ ప్రదేశాన్ని, విఆర్ కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేస్తున్న పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ హిమవతి, ఆర్డిఓ మలోల, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలా దేవి, ఆర్ అండ్ బి, మునిసిపల్ శాఖ, ఎస్పి డిసిఎల్, ఇరిగేషన్ ఎస్.ఈ లు గంగాధర్, సంపత్ కుమార్, వెంకట సుబ్బయ్య, కష్ణమో హన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. పెంచలయ్య, ఆర్టిసి ఆర్.ఎం శేషయ్య, మత్స్యశాఖ జెడి నాగేశ్వర రావు, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, పర్యాటక శాఖాధికారి సాయి కష్ణ,, రూరల్ తహశీల్దార్ సుబ్బయ్య ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ఏర్పాట్లను పర్యవేక్షించిన 'ఆదాల'

బారాషాహిద్ దర్గా ప్రాంతంలో ఈ నెల 29వ తేది నుంచి 5 రోజుల పాటు నిర్వహించనున్న రొట్టెల పండుగ నిర్వహణకు సంబందించిన ఏర్పాట్లును ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న భక్తులను దష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు.కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ మేయర్ రుప్ కుమార్ యాదవ్ ఉన్నారు.

ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్

సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బిందుమీనన్

ప్రజాశక్తి-నెల్లూరు

ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ సెక్రటరీ జనరల్‌గా అపోలో స్పెషాలిటీ వైద్యశాల సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్టు, ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ ఎన్నికయ్యారు. బుధవారం ఆమె అపోలో వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23వన జైపూర్ లో ఎపిలెప్సీ ఈసిఒఎన్ జాతీయ సదస్సులో ఈ ఎన్నిక జరిగిందన్నారు. ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ అనేది 1970లో స్థాపించారని, ఎపిలెప్సీకి సంబంధించిన జాతీయ రిజిస్టర్డ్ బాడీ. ఫలితాలు ప్రకటించబడ్డాయన్నారు. తన పరిశోధన, విద్య, చికిత్స, ఔట్‌రీచ్ కేర్‌లో భాగంగా మూర్ఛ వ్యాధిగ్రస్తుల అభ్యున్నతికి కషి చేస్తున్నందుకు తనకు ఈ పదవి దక్కిందన్నారు. ఎంతో బాధ్యతాయుతమైన పదవి కావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని, మూర్ఛ వ్యాధికి సంబంధించిన కారణాల కోసం అంకితభావంతో పని చేస్తామని ఆమె తెలిపారు.



జైపూర్‌లో జరిగిన సదస్సులో డాక్టర్ బిందుమీనన్

పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పుస్తకాలు పఠనం చేయడం వల్ల విజ్ఞానం పెంపొందుతుందని సర్పంచ్ చెరుకూరి సరళ తెలిపారు. మండలం సౌత్ ఆములూరులోని ప్రాథమికోన్నత పాఠశాలకు సెమ్క్రాప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి ఆర్. సింథిల్ కుమార్ బుధవారం లైబ్రరీ పుస్తకాలు, టి.ఎల్.ఎం అందజేశారు. ప్రధానోపా ధ్యాయులు షేక్. అహ్మద్ బాషా అధ్యక్షతన ఏర్పటైన ప్రత్యేక కార్యక్రమానికి సరళ కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చక్కని కథల పుస్తకాలు, టి.యల్.యం అందజేసిన సెంకార్బ్ ప్రతినిధి సింధిల్ కుమార్‌ను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. జి శివకుమార్, సి.యస్.ఆర్ సిబ్బంది భాస్కర్, పవన్, బాలకష్ణ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో

రాజకీయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కందుకూరు : సిపిఎం కందుకూరు నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 29, 30 తేదీల్లో జరగనున్న సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎ గౌస్ తెలిపారు. జిల్లా నాయకులు హాజరై క్లాసులు బోధిస్తారని ఆయన తెలిపారు.

హోంగార్డుకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులో హోంగార్డు మునీర్ పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న సందర్భంగా మార్గమధ్యంలో ఒక సెల్ ఫోన్ దొరికింది. ఆ సెల్ ఫోన్ ద్వారా ఫోన్ చేసి వారి సెల్ ఫోన్ తన వద్ద ఉందని వారికి తెలియపరిచారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితురాలు (విశ్రాంత ఎఎస్ఐ సతీమణి) వారి బంధువుల ద్వారా సెల్ ఫోన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా హోంగార్డు మునీర్ కు ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు పోలీసు సిబ్బంది మునీర్ ను అభినందించారు.

ఫోన్ అప్పగిస్తున్న మునీర్

కందుకూరు -విక్కిరాలపేట

రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు- విక్కిరాలపేట రోడ్డు గుంతల మయంగా మారింది. ఏళ్ల తరబడి రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో అడుగడుగునా గుంతల మయంగా మారింది.రోడ్డు మరమ్మతుల కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి దాదాపు రూ. 26 కోట్లు మంజూరు చేయించారు. టెండర్ల విషయంలో ఏర్పడిన గందరగోళం రహదారి మరమ్మతులకు ఇబ్బందిగా మారింది. దాదాపు టెండర్లు కొలిక్కి వచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కందుకూరు విక్కిరాలపేట రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో ఒక్క తట్ట కూడా మట్టి పోయ లేదనే విమర్శలు ఉన్నాయి.

అస్తవ్యస్తంగా ఉన్న రహదారి

ఆటోలకు పార్కింగ్ స్థలాలు చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించి అధికారుల వేధింపుల నుంచి విముక్తి కలిగించాలని ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా, జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్‌లు మాట్లాడుతూ గడిచిన 40 ఏళ్ల నుంచి ఆటో కార్మికులు రోడ్డు మార్జిన్‌లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రజలకు ఇబ్బంది కలవకుండా ఆటో స్టాండ్లు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకొని కార్పొరేషన్ పరిధిలో వందలాదిమంది ఆటో కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆటో కార్మికులు పలు దఫాలుగా తమకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని మున్సిపల్ అధికారులను, కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అంతే కాకుండా ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేసుకొనేందుకు స్థలాలు చూపాలని కోరామన్నారు. నేటికి ఈ అర్జీలు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికుల స్వయంగా స్టాండ్లు ను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే కమిషనర్ రహదారుల విస్తరణ పేరుతో ఆటో స్టాండ్‌లను తొలగించాలని చెప్పడం దారుణమన్నారు. ప్రధాన రైల్వే స్టేషన్ పార్సెల్ ఆఫీస్ దగ్గర ఉన్న ఆటో స్టాండ్ ని కమిషనర్ తొలగించారన్నారు. ఈ చర్యను జిల్లా ఆటో కార్మిక సంఘంగా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆటో కార్మికులకు న్యాయం చేయాల్సినటువంటి ప్రభుత్వాలు ఇలాంటి ఇబ్బందికర పనులు చేస్తూ కార్మిక వర్గాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఆటో కార్మికులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో కార్మికులను కార్మిక వర్గాన్ని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా రూరల్ కార్యదర్శి ఎం. సుధాకర్ నగర నాయకులు పి. మురళి సిహెచ్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

'ప్రకాశం'లో వాయు విద్యుత్ కేంద్రం

ప్రజాశక్తి-కందుకూరు :ఆధునిక సాంకేతికకు ఆదర్శానికి ముందుండే ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ మరో అడుగు ముందుకు వేసింది.విండ్ మిల్ (వాయు విద్యుత్ ఉత్పత్తి) పుస్తకాలకే పరిమితమైన కాలంలో కాలేజీ ఆవరణంలో విండ్ మిల్ స్థాపనకు పూనుకున్నట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య వెల్లడించారు.దీనికి సోలార్ ఉత్పత్తిని జోడించి హైబ్రిడ్ పవర్ ప్లాంట్ తీర్చిదిద్దడం మరో ప్రత్యేకత అని ఆయన అభివర్ణించారు. ఈ ప్లాంట్ 2.5 కిలోవాట్ల సామర్థ్యంతో విద్యుత్ వాయు, సూర్య కాంతితో ఉత్పత్తి చేస్తుంది. అంతకుముందు సోలార్ ఆన్ గ్రిడ్ , ఆఫ్ గ్రిడ్ విద్యుత్ ప్లాంట్లను కాలేజీ లో స్థాపించినప్పుడు జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ ,రాష్ట్రంలో ఉన్నటువంటి ఎన్నో ఇంజినీరింగ్ కాలేజీల అధిపతుల నుంచి ప్రశంసలు వచ్చాయ న్నారు. వినూత్నంగా ఏర్పాటుచేసిన ఈ ప్లాంట్ ఆదర్శంగా నిలుస్తుందని టెక్నికల్ డైరెక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ అన్నారు. బాలాజీ సిస్టమ్స్ విండ్ మిల్, కోయంబత్తూర్ తమిళనాడు కంపెనీకి అధినేత కనకరాజు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్మెంట్, ఈ విండ్ మిల్ స్థాపించడం ఎంతో హర్షనీయమని ఇక్కడ చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి తయారీ కళ్లకు కట్టినట్లుగా చూసే అవకాశం కలగడం, విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఇన్స్టాలేషన్ అండ్ ఆపరేషన్ చేసే కార్యక్రమంలో కంపెనీ అధినేత కనకరాజుతో పాటు ఇన్స్టాలేషన్ అధికారులు సభాపతి మరియు కరణ్ చేయూతనందించారు.కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చదలవాడ రవికుమార్, కాలేజీ టీచింగ్ స్టాఫ్ డాక్టర్ దస్తగిరి, డాక్టర్ రాకేష్, పీ.ఎం.రూప, షరీఫ్ ఉన్నారు.

ప్రకాశంలో హైబ్రిడ్ వాయు విద్యుత్ కేంద్రం పనులు పరిశీలిస్తున్న కంచర్ల రామయ్య

సర్వీసు పేరుతో వసూళ్లు

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల నిర్వాహకం

ప్రజాశక్తి -పొదలకూరు

పొదలకూరు పట్టణంలో దాదాపు 19,000 గ్యాస్ కనెక్షన్స్ కలిగిన ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ వినియోగదారుల వద్ద వసూళ్ళ పర్వం మొదలుపెట్టారు. పట్టణంలోని ప్రతి ఇంటి వద్దకెళ్లి తాము గ్యాస్ ఏజెన్సీ నుంచి వచ్చిన ప్రతినిధుల మని, ఐదేళ్లకు ఒకసారి గ్యాస్ కనెక్షన్ చెకప్ చేయించుకోవాలని అలా చేయించుకుంటేనే గ్యాస్ కనెక్షన్ రెన్యువల్ అవు తుందని చెబుతున్నారు.సర్వీస్ ఛార్జీల పేరుతో ఒక్కొ ఇంటి వినియోగదారుడి నుంచి రూ 236 వసూలు చేస్తున్నారు. కేవలం పైపు,రెగ్యూలేటర్ చెక్ చేసిన దానికే రూ 236 వసూలు చేయడం ఏమిటని పలువురు వినియోగదారులు సదరు వ్యక్తులను ప్రశ్నించారు. అలా చేయించుకుంటేనే కనెక్షన్ రెన్యూవల్ అవుతుందని లేకుంటే రెన్యూవల్ కాదని పలువురి వద్ద ఇప్పటికే నగదును వసూలు చేశారు. రెగ్యూలేటర్ సమస్య వుంటే ఇంటి వద్ద మార్చకుండా గ్యాస్ ఏజెన్సీ వద్దకు వినియోగదారులు రావాలని సూచించడంపై పలువురు మండిపడుతున్నారు. సర్వీస్ చేయడానికి వచ్చిన వ్యక్తులు పైపు అయితే ఇంటి వద్ద మార్చి రూ 190 తీసుకుంటున్నారని,అదే రెగ్యూలేటర్ ఇంటివద్దే మార్చాలికాని అక్కడకి తీసుకొని వెళ్ళమని చెప్పడం ఏంటని వాపోతున్నారు.దీనిపై సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనల ప్రకారం నడుచుకునేలా చర్యలు తీసుకునేలా చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆందోళనలో అగ్రిగోల్డ్ బాధితులు

ప్రజాశక్తి-గుడ్లూరు : పైసా పైసా కూడబెట్టి అగ్రిగోల్డ్ సంస్థలో దాచుకున్న డబ్బులు ఏళ్ల గడిచిన రాకపోవడంతో మండలంలోని వేలాదిమంది అగ్రిగోల్డ్ బాధితులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పది నుంచి 20,000 వేలులోపు ఉన్న కొద్ది మందిబాధితులకు మాత్రమే డబ్బులు చెల్లించి మిగతా వారికి చెల్లించకపోవడంతో అగ్రిగోల్డ్ బాధితులు ప్రతిరోజు ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. ఏజెంట్లు సైతం పట్టించుకోవడంలేదని మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఎస్కే హుస్సేన్, తలపల మాల కొండయ్య విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకి సుమారు రూ. 18 కోట్లు రావాల్సి ఉందని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు జాలయ్య తెలిపారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం ఏలూరు కోటులో కేసు వేయడంతో బాధితులకి డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని స్థానిక ఏజెంట్లో కొందరు చెబుతు న్నారన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకొని అగ్రిగోల్డ్ బాధితులకి డబ్బులు చెల్లిం చాలని రాష్ట్ర ప్రభుత్వానికి బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

టిడ్కో గృహాల పంపిణీకి

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నెల్లూరు :వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన ఎపిటిట్కో (జిప్లస్3) ఇళ్ల కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఇళ్లను ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు రాకపోవడం వల్ల ఆ కేటాయింపులను రద్దు చేసి సమాన ప్రక్రియ పద్దతిలో ప్రభుత్వం కేటాయించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు తమ వాటాగా 365 ఎస్ఎఫ్‌టి గృహానికి రూ.25 వేలు చెల్లించాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు అందజేసి రశీదు పొందాలని సూచించారు.

హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :కార్పొరేషన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు హెల్త్ కార్డులను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అందజేశారు. ఆప్కాస్ విజయవాడ వారిచే ఔట్ సోర్సింగ్ కార్మికుల ఈఎస్ఐ, ఈపిఎఫ్ సమస్యలకు పరిష్కారం అందించే ప్రత్యేక కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. సదరు కార్యక్రమ నిర్వహణ వల్ల ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంబంధించి చాల రోజులుగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం తో పాటు హెల్త్ కార్డులను మంజూరు చేసి కమిషనరు వికాస్ మర్మత్ ద్వారా కార్మికులకు అందజేశారు. ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగ ప్రసాద్ .సిబ్బంది, నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : 'ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు ఆధ్వర్యంలో బుధవారం పేదల కోసం కందుకూరులో ఊరిబయట నివాసం ఉండే వద్దులు, వికలాంగులను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ పేర్కొన్నారు. ప్రెసిడెంట్ సాజిద్,ట్రజరర్ హఫీజ్,ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ వెంకటసుబ్బయ్య

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : బారా షాహిద్ దర్గా వద్ద ఈనెల 29 నుంచి రొట్టెల పండగు జరుగుతున్న నేపథ్యంలో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్ఈ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన, విద్యుత్తు శాఖ సిబ్బందితో కలిసి బార షాహిద్ దర్గాను సందర్శించి దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలించారు అత్యవసర సమయంలో వినియోగించుకొనేందుకు 125 కెవిఎ డిపార్ట్మెంటల్ జనరేటర్‌ను సిద్ధం చేశామన్నారు. దాదాపు 2000 కెవిఎ సామర్థ్యంతో నిరంతర విద్యుత్‌కు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ సోమశేఖర్ రెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'డయల్ యువర్ డిఎం'కు విశేష స్పందన

ప్రజాశక్తి-కావలి : కావలి ఆర్టిసి డిపోలో బుధవారం నిర్వహించిన 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ మంది పాల్గొని తమ సమస్యలు, సూచనలు తెలియజేశారు. ఎపిఎస్ ఆర్టిసి, కావలి డిపో మేనేజర్ రావూరు శ్రీనివాసులు వారి సమస్యలు, సూచనలు విని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కావలి పట్టణానికి చెందిన విజయ్ హైదరాబాద్‌కు బస్సు కావాలని కోరగా, ఆత్మకూరు డిపోకు చెందిన బస్సు, కావలి మీదుగా హైదరాబాద్ వెళ్లే విధంగా ఏర్పాటు చేశామని, కావలి వాసులు ఆ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లవచ్చని డిఎం తెలిపారు. కప్పరాళ్లతిప్ప కూడలి వద్ద బస్సు రాకపోకల సమయాలతో సూచిక (టైమింగ్ బోర్డు) ఏర్పాటు చేయాలని రవీంద్ర కోరగా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గుడ్లదొనకు ఉదయం 6గంటల తరువాత మధ్యాహ్నం 1గంట వరకు బస్సు లేనందున ఇబ్బంది పడుతున్నామని గుడ్లదొన గ్రామానికి చెందిన హరి కోరగా, గురువారం నుండి 11.15 గంటలకు గుడ్లదొనకు ట్రిప్ ఏర్పాటు చేస్తున్నారు. లింగసముద్రం గ్రామానికి ఉదయం ట్రిప్ 9గంటల 9.15కు మార్చాలని, ప్రతిరోజూ ప్రయాణించే ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరపున రఘునాథ్ కోరగా వెంటనే మార్పు చేశామని తెలిపారు. గొట్టిగుండాల సర్వీస్ పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన ప్రసాద్ కోరగా గత అనుభవాల దృష్ట్యా ప్రయాణికుల ఆదరణ లేనందున బస్సు నడపడం సాధ్యం కాదని వివరించారు. దగదర్తి, బుచ్చిరెడ్డిపాలెం మధ్య ట్రిప్పుల బస్సు కావాలని తురిమెర్ల గ్రామానికి చెందిన మాలకొండయ్య కోరగా తగు చర్యల నిమిత్తం నెల్లూరు 2 డిపోకు తెలియపరుస్తామన్నారు. తుమ్మలపెంట సెంటర్ వరకు మాత్రమే బస్సులు వస్తున్నాయని, ఊరిలోకి బస్సులు నడపాలని గ్రామానికి చెందిన షేక్ ఫరీద్ చెప్పగా సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని డిఎం శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవిజర్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) ఎం రమేష్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి రవిప్రకాష్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

ప్రజాశక్తి-సీతారామపురం : స్థానిక మండల సమైక్య కార్యాలయంలో 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆర్థిక నిర్వహణ విధానంపై సంఘ బంధాల ఓబిలు, మండల సమైక్య ఓబిలకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసిందని డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎంబిజ్జు సుధాకర్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టు కింద సంఘాలను బలోపేతం చేయడానికి వారి సంఘాల రుణ పరిపాలన, ఆర్థిక వ్యవస్థలపై, అకౌంట్లు, పొదుపులపై శిక్షణ ఇచ్చారు. వివఓలు, ఓబిలు కలిసి సంఘ బంధాల పనితీరు లావాదేవీలు, ఆర్థిక విధానం, పుస్తకాల నిర్వహణ గురించి తెలిపారని, ప్రణాళికలను తయారు చేసుకోవాలని, కొత్త విధానాలను తెలిపామన్నారు. కార్యక్రమంలో సిసిలు బాల గురవయ్య, హబీబ్, మరియమ్మ, చెన్నకేశవులు అధ్యక్షురాలు శారద, అకౌంటెంట్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-జలదంకి : కావలి-ఉదయగిరి రోడ్డుపై జలదంకి పోలీస్ స్టేషన్ ఎదురుగా బుధవారం కలిగిరి సిఐ ఎమ్‌డి ఫిరోజ్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారు వాహనాలను ఆపి వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సులను, ఆర్‌సిలను అడిగి తెలుసుకొని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి ఆర్‌సి లేని వారికి అపరాధ రుసుము విధించారు. దీనితో పాటు డ్రింక్ అండ్ డ్రైవ్ను నిర్వహించి వాహనదారులను కఠినంగా శిక్షించారు. హెల్మెట్ లేనివారికి కూడా అపరాధ రుసుము విధించారు. ఎస్ఐ హరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్ఆర్'లో కార్గిల్ దివస్ వేడుకలు

ప్రజాశక్తి-ముత్తుకూరు : స్థానిక ఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కార్గిల్ విజయదివస్ సందర్భంగా బుధవారం కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం చేసిన పోరాటాలను గుర్తు చేసేలా విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర జవానులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మహబూబ్ బాషా మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ సమయంలో మంచు కొండల్లో ప్రాణాలను పణంగా పెట్టి పాక్ ఉగ్రవాదులపై సమరం సాగించారు. కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమర జవాన్లను విస్మరించుకుంటూ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-సంగం : గాంధీజనసంఘంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన జె.సౌజన్య, అబ్దుల్ రషీద్, పెంచలనీతేశ్‌కు గణిత ఉపాధ్యాయులు యూకొరి.పెంచలయ్య తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ మేరకు పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు, పాఠశాల బోధన సిబ్బంది, అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. అదే సందర్భంలో హిందీలో 97 మార్కులు సాధించినందుకు రషీద్‌కు హిందీ పండితులు మధుకు రూ.5వేల అందించినందులకు పాఠశాల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'పై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కొడవలూరు : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎం.పెంచలయ్య సూచించారు. మండలంలోని పెయ్యలపాలెంలో జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారా లేదా పరిశీలించారు. బీపీ, సుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు సకాలంలో అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రక్త హీనతను గురించి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకోవడంతోపాటు ఓపి ద్వారా పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారికి మందులు అందిస్తుండడం ఇంట కుష్టు రోగుల ఇళ్లకు సైతం వెళ్లి వైద్యం సహాయిస్తుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారిణి గీత సాహితి, సొసైటీ అధ్యక్షుడు నాగ శ్రీనివాసులు రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి ఎస్‌కె రేష్మా, హెచ్ ఎస్ పద్మ, హెచ్‌ఎస్ సిహెచ్ సుధాకర్, వి.రాధిక, ఆశా కార్యకర్త మల్లేశ్వరి ఉన్నారు.

రీసెర్చ్ ఫెలోషిప్ స్టైఫండ్‌పై బిఎంఆర్ ప్రశ్న



ప్రజాశక్తి-కావలి : జూనియర్, సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల స్టైఫండ్‌పై తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని బుధవారం కేంద్ర విద్యా శాఖ మంత్రిని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కోరారు. ఎం.ఫిల్, పిహెచ్‌డి విద్యార్థులకు యుజిసి మంజూరు చేస్తున్న జూనియర్, సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం స్టైఫండ్ పంపిణీలో అడ్డంకులు, ఆలస్యం, రెడ్‌టేప్‌కు సంబంధించిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిశీలించిందా.. అలా అయితే, స్టైఫండ్ల పంపిణీని క్రమబద్ధీకరించడానికి తీసుకున్న దిద్దుబాటు చర్యలను తెలపాలన్నారు. కేంద్రానికి సిఫార్సు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం జె.ఆర్.ఎఫ్, ఎస్.ఆర్.ఎఫ్.కోసం స్టైఫండ్ మొత్తాన్ని రూ.50 వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందా అని అడిగారు. అలా అయితే, దాని వివరాలు, కాకపోతే, దానికి కారణాలు తెలపాలని కోరారు. అందుకు కేంద్ర విద్యాశాఖలోని రాష్ట్ర మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ సమాధానమిస్తూ జూనియర్ రీసెర్చ్ ఫెలోకీ, సీనియర్ రీసెర్చ్ ఫెలోకీ సకాలంలో ఫెలోషిప్ పంపిణీ కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుండి అందిన సమాచారం ప్రకారం యుజిసి ప్రత్యేక స్కాలర్‌షిప్ ఫెలోషిప్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌ను అభివృద్ధి చేసిందన్నారు. స్కాలర్లు తమ సమస్యలను ఎస్.ఎఫ్.ఎం.పి.లో పొందుపరిచి వాటి పరిష్కార స్థితిని ట్రాక్ చేయవచ్చని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ నుండి అందిన సమాచారం ప్రకారం జూన్ 26, 2023 నాటికి నెలకు జెఆర్ఎఫ్‌కు రూ.37వేలు, ఎస్.ఆర్.ఎఫ్.కు నెలకు రూ.42వేల చెల్లింపులను జనవరి, 2023 నుండి అమలులోకి వచ్చిందని తెలిపారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-ముత్తుకూరు : హిందూ-ముస్లిముల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు బుధవారం మండలంలో ప్రారంభమయ్యాయి. పీర్ల చావిడిలో నిలిపిన పీర్లకు మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించగా భక్తులు అధిక సంఖ్యలో పీర్ల స్వాములను దర్శించుకొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మతసామరస్యానికి ప్రతీకగా ముస్లిం సోదరులు జరుపుకునే మొహర్రం వేడుకలు ఉదయగిరిలో బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాగులబావి వీధి గుంతబజార్ ప్రాంతాల్లో పీర్లను ముస్తాబు చేసి నిలిపారు. పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరించి 29వ తేదీ వరకు వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహ అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పీర్లను ఊరేగింపుతో పాటు భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు

ఆత్మకూరులో...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మణిపూర్ ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిన ఘటనకు వ్యతిరేకంగా ఆత్మకూరు పట్టణంలోని కెవిపిఎస్ ఎపి రైతు సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం అఖిలపక్ష కన్వీనర్ ప్రముఖ న్యాయవాది కె.వి.శేషారెడ్డి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రజలను రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం మూడు నెలల నుంచి జరుగుతున్న అల్లకల్లోల పరిస్థితులను అదుపు చేయలేక పోయిందా లేక తనే చేయిస్తుందా అనే అనుమానం ప్రతిపక్షాలు పార్లమెంటులో ప్రశ్నించాని తెలిపారు. ప్రధాని మోడీ మౌనం వెనుక ఉన్న ఉద్దేశం అదేనా అనే విషయం బహిరంగపరచాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయన్నారు. మణిపూర్ కొండల్లో ఉన్న నిధి నిక్షేపాలను అస్మదీయు లకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం ఈ అల్లర్లను ప్రోత్సహిస్తుందన్నారు. ట్రైబల్ జాతులను భయాందోళనలకు గురి చేసి దేశంలో కల్లోల పరిస్థితులపై ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, ఎపి రైతు సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్, మాజీ రైతు సంఘ నాయకులు చేవూరు రామకృష్ణారెడ్డి, టైలర్స్ అసోసియేషన్ నాయకులు షేక్.ముజీబ్, షేక్.మహబూబ్ బాషా, కటారి నాగార్జున, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలిరూరల్ : మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక హత్యాచారాలకి నిరసనగా బుధవారం మండలంలోని రాజువారి చింతలపాలెంలో గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ ఇటీవల మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేశారని, అడ్డు వచ్చిన ఆ మహిళ తమ్ముడిని, తండ్రిని కూడా హత్య చేశారన్నారు. మహిళలపై జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునే లాగా ఉందన్నారు. మణిపూర్‌లో మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతుంటే కనీసం రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరు విప్పకపోవడం చాలా దారుణమన్నారు. ఈ దురాగతాలను ఆకత్యాలను ప్రజలందరూ ఖండించాలన్నారు. కేంద్రంలోని బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రోత్సాహంతో మహిళలపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాల కొండమ్మ, ప్రసాద్, లలితమ్మ, బుజ్జమ్మ, శశి హర్ష, జయంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కావలిలో..

ప్రజాశక్తి-కోవూరు : మణిపూర్‌లో జరిగిన మారణహోమంకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జాతిపిత గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియా మిత్రులు గాంధీబొమ్మ సెంటర్ నుంచి బజార్ సెంటర్ వరకు కొవ్వొత్తులు పట్టుకొని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బజార్ సెంటర్లో మీడియా మిత్రులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని కేంద్ర ప్రభుత్వం స్పందించి అణిచివేయాలని కోరారు. అసాంఘిక శక్తులు అరాచక వ్యక్తులు మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు గృహ దహనాలు మూకుమ్మడి అత్యాచారాలు యథేచ్ఛగా పోలీసులు సమక్షంలోనే జరుగుతున్నా, అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌కు రక్షణ బలగాలను తరలించినా ఇంతవరకు అక్కడ శాంతిని నెలకొల్ప లేకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే శాంతిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అండ్ సోషల్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-జలదంకి

జలదంకి గ్రామంలోని స్థానిక గట్టుపల్లి రోడ్డు సమీపంలో పెద్ద చెరువు కట్ట కింద ఎలాంటి జీవనాధారం లేక పూరి గుడిసెలు వేసుకొని విష పురుగుల మధ్య బతుకుతున్న చల్లా యానాదులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని జలదంకి ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం చల్లా యానాదులతో కలిసి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఎంపిడిఒ శ్రీధర్ బాబుకు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవ యాదవ్ మాట్లాడుతూ చల్లా యానాదులు గతంలో గౌరవరం మేజర్ కాలువపై పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఉండేవారని, జలదంకి హైవే రోడ్డు మంజూరు కావడంతో వారి ఇళ్లను హైవే అధికారులు తొలగించారని తెలిపారు. దాంతో గత్యంతరం లేక వారు పెద్ద చెరువు కట్ట కింద తిరిగి పూరి గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. దాదాపు 15 కుటుంబాలు ఉన్న ఈ చల్లా యానాదులకు అక్కడ వీరికి ఎలాంటి సౌకర్యం లేక విషపురుగుల మధ్య భయం భయంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వారికి కనీసం విద్యుత్ లైన్ అయినా ఏర్పాటు చేసి వెలుగులను నింపాలన్నారు. కార్యక్రమంలో చల్లా యానాదులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పక్కాగా నిర్వహించండి

- ట్రైనీ కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పక్కాగా ఓటర్ల జబితాను నిర్వహించాలని ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో జరుగుతున్న ఓటరు రీ వెరిఫికేషన్‌ను ఆమె ఆత్మకూరు ఆర్‌డిఒ ఎస్.కరుణకుమారితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించి ఓటర్ల జాబితా పక్కాగా ఉండేలా బిఎల్ఒలు చూడాలన్నారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సమయంలో డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి ఓట్లతో పాటు గ్రామం విడిచి సంవత్సరాలుగా వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రీవెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. ఒక డోర్ నెంబరు మీద ఒక కుటుంబసభ్యులు ఉండేలా వరుస క్రమంలో ఏర్పాటు చేయాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్ల సంఖ్య పెరిగితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు కార్డులో ఫొటో మార్పులు, పేర్లలో తప్పిదాలు సవరించేందుకు అవసరమైన ఫారంలను వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రూ.25,116 విరాళం

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్న మొహర్రం పండుగ సందర్భంగా పీర్ల చావడి వద్ద అన్నదాన కార్యక్రమానికి మాజీ మంత్రి వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణ రెడ్డి రూ.25,116లను నిర్వాహకులకు అందించారు. ఆనం రామ నారాయణ రెడ్డి పంపించిన నగదును టిడిపికి చెందిన స్థానిక వార్డు కౌన్సిలర్ గౌస్ బాషా ఇక్కడికి నిర్వాహకులకు అందజేశారు. పీర్ల చావిడి కమిటీ నిర్వాహకులు, స్థానికులు ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర టిడిపి నేత దావా పెంచలయ్య, చల్లా రవికుమార్ రెడ్డి, పిడికేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఉత్సవాలకు రూ.10వేలు వితరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

పవిత్ర మొహర్రం సందర్భంగా ముస్లీం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పీర్ల ఉత్సవాలకు మన ఫౌండేషన్ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి బుధవారం యూనియన్ రోడ్ పీర్ల చావిడి రూ.10వేలు వితరణగా అందజేశారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగలో పీర్లు నాటి త్యాగధనుల ప్రతిరూపాలని అటువంటి పవిత్ర పండుగలో తాను భాగస్వామిని కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మన ఫౌండేషన్ ద్వారా వితరణ చేసిన రూ.10వేలను మన ఫౌండేషన్ ప్రతినిధులు మిత్రులు ఉత్సవ నిర్వాహకులైన పెద్దల చేతికి అందజేశారు. కార్యక్రమంలో పీర్ల చావడి పెద్దలు కరీం అమీర్ ఖాజా, మన ఫౌండేషన్ సభ్యులు గాజుల రంతుజాని, శ్రీను, మున్న, బాబు, అర్షద్ నౌషాద్, అఖిల్ పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రియవధ

ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రియవధ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాన్పుల గది, ల్యాబ్‌ను వాటి పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయాలని అందుకు ఉద్యోగులందరూ సహకరించాలని కోరారు. రోగులతో మర్యాదగా నడుచు కోవాలని కోరారు. అన్ని పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరుగుతున్నాయన్నారు. కాబట్టి రోగులకు అర్థమయ్యే విధంగా వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కరిష్మా, సిహెచ్ఒ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రధాన దృష్టి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ (చేజర్ల)

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేజర్ల మండలం పెరుమాళ్లపాడు సచివాలయం పరిధిలోని పుట్టుపల్లి, కొట్టాలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గడపకు అందచేసిన సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. అంతకు ముందుగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రామంలోని శివాలయం, రామాలయాల్లో పూజలు నిర్వహించారు. ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉన్న శివాలయం జీర్ణోద్ధరణ పనులు చేయించాలని గ్రామస్తులు కోరడంతో ఆయా శాఖల అధికారులకు తెలిపి పరిష్కరిస్తానన్నారు. పలువురు గ్రామస్తులు రోడ్లు, సైడ్ డ్రైన్ల విషయమై ఎంఎల్ఎ మేకపాటి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేసి తమకు అందచేయాలని, అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తానని తెలిపారు. గృహ నిర్మాణాల విషయమై పలువురు ఎంఎల్ఎ దృష్టికి తీసుకురావడంతో లెవలింగ్ పనులు నిర్వహించి అందరికీ సొంతింటి కలను నిజం చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు అభివృద్ధి పనులు మంజూరవుతాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. అందరి సంక్షేమం కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే 2024 ఎన్నికల్లో ప్రజలందరూ అండగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

'మహాశక్తి'తో మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ బొల్లినేని

ప్రజాశక్తి-కలిగిరి

'మహాశక్తి' తో మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ అని మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. బుధవారం కలిగిరి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ మహిళా మణులతో మహా శక్తి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల సాధికారత కోసం ప్రవేశపెట్ట తలచిన మహాశక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డను మహాశక్తిమంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆలోచన చేశారన్నారు. "మహాశక్తి" పథకం ఉద్దేశాన్ని రాష్ట్రంలోని మహిళల దృష్టికి తీసుకెళ్లి చైతన్య పరచాలనే సంకల్పంతో నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం వంటి హామీలను మహిళలకు కోసం మేనిఫెస్టోలో ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వికాస్ హరికృష్ణ, మహిళా నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం మహాశక్తి టీం మహిళలు బుధవారం మండలంలోని సర్వాయపాలెం పంచాయతీలోని అన్ని గ్రామాలలో పర్యటించారు. "మహాశక్తి" వాహనంలో బయల్దేరి ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమం గురించి వివరిస్తూ మహిళలతో "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఉన్న సౌలభ్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు దీవిస్తూ ఆశీర్వదించిన పసుపుతాడులను మహాశక్తిలోని మహిళలకు అందించారు. కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, కొల్లూరు అశ్విని, పసుపులేటి పద్మ, రాధమ్మ, కట్టమూరు శ్రీదేవి, కావలి రూరల్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, ఎంపీటీసీ జంపాని శ్రీనివాసులు, పార్టీ ముఖ్య నాయకులు ఉప్పాల వెంకయ్య, నాగేశ్వరరావు, రమేష్, నాగేంద్రబాబు, తాత యానాది, జంపాని ప్రసాద్, కోర పొట్టయ్య, రామయ్య, సీనయ్య, వసంత్, ఎం.ప్రసాద్, మరికొంతమంది పార్టీ కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కావలిలో...

సమాజంలోని పేదరికాన్ని నిర్మూలించాలి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో పీడనలేని అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ప్రజాస్వామిక వాదులు, పౌర సంస్థలు కృషి చేయాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న నవ సమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు అధికారులు స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరిచి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. భారతదేశంలో ఎంతోమంది సంఘసంస్కర్తలు సామాజిక రుగ్మతులపై పోరాడి ప్రజాస్వామ్య వ్యవస్థపరిపూర్ణం కావడానికి కృషి చేశారని తెలిపారు. నేడు అదే స్ఫూర్తితో భారతరత్న బిఆర్ అంబేద్కర్, గాంధీజీ, లోక్ నాయక్, జయప్రకాష్ నారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, లాంటి ఎందరో మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని అవినీతికి తావులేని స్వచ్ఛమైన పరిపాలన అందించే విధంగా వ్యవస్థను నిర్మించాలని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు నిరంతరం సమాజాన్ని మేల్కొల్పాలని కోరారు.

టిడిపివి అనవసరపు విమర్శలు

ప్రజాశక్తి-కావలి

గత ఆదివారం 23వ తేదీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో ఒక్కరోజులోనే ఏర్పాటు చేసిన మత్స్యకారుల ఆత్మీయ సమావేశం హాజరైన మత్స్యకారులు, కాపులను చూసి, ఓర్వలేకనే టిడిపికి చెందిన మత్స్యకార నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి, అవాకులు, చవాకులతో విమర్శలు చేశారని వైసిపికి చెందిన మత్స్యకార నాయకులు నాగనగారి శ్రీనివాసులు, కొండూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో పాల్గొని టిడిపి నాయకుల విమర్శలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమావేశంలో పాల్గొన్న ఒక మత్స్యకారుడు తెలియక మాట్లాడితే తాము అతనిని సమాధానపరిచి కూర్చోబెట్టామని, దానిని చూపించి, మత్స్యకారుడిని గొంతు నొక్కి, గదిలో పెట్టామని టిడిపి నాయకుల విమర్శకు సమాధానమిస్తూ, గతంలో మత్స్యకారుల ఓట్లతో గెలిచిన టిడిపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సంక్షేమ పథకాలు కోరిన మత్స్యకారులను అవమాన పరిచిన సంగతి మత్స్యకారులు ఇప్పటికీ మర్చిపోలేదని గుర్తు చేశారు. అభివృద్ధి పనుల మాటకొస్తే, మత్స్యకార గ్రామాలలో బూజుపట్టి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బూజు దులిపి, నాడు - నేడు పనులతో అభివృద్ధి చేసి, కార్పొరేట్ స్కూళ్లకు సమానంగా వైసిపి ప్రభుత్వం తీర్చిదిద్దిన వైనం తెలియదా అని ప్రశ్నించారు. బాబు వస్తే - జాబు వస్తుందని ఓట్లు వేస్తే, బాబు నిరుద్యోగులను పెంచి పోషిస్తే, జగనన్న వలంటీర్ వ్యవస్థ తెచ్చి, లక్షలాది మందికి ఉద్యోగాలిచ్చారన్నారు. 17 సంవత్సరాలు పరిపాలించిన చంద్రబాబు జువ్వలదిన్నెలో కేవలం శిలాఫలకం వేసిపెడితే, తమ ప్రభుత్వం జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించి, 2నెలల్లో ప్రారంభించానున్నారని తెలిపారు. జువ్వలదిన్నె నుండి రామాయపట్నం పోర్టు వరకు రోడ్డు వేయించారని, జువ్వలదిన్నె హార్బర్, రామాయపట్నం పోర్టులను అభివృద్ధి చేయించింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో గతంలో రూ.2వేలుగా ఉన్న మత్స్యకారుల పెన్షన్ రూ.2750లకు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఇకనైనా విమర్శలు చేయడం టిడిపి నాయకులు మానుకోవాలని మత్స్యకార నాయకులు హితవు పలికారు. సమావేశంలో మత్స్యకార నాయకులు పామంజి బాబు, సర్పంచ్ గోవిందు, పొన్నాడి శూలం, వెంకటస్వామి, భక్తాని నరసింహ (తాతయ్య), పామంజి శ్రీను, తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'పిఎం శ్రీ'పై వేమిరెడ్డి ప్రశ్న

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పిఎంశ్రీ) లక్ష్యాలు ఆంధ్రప్రదేశ్‌లోని 662 పాఠశాలలను పిఎంశ్రీ కింద గుర్తించడం వాస్తవమేనా, గుర్తించిన పిఎంశ్రీ పాఠశాలల్లో అందించబోయే సౌకర్యాల వివరాలు, పాఠశాలల కోసం అంచనా వేసిన వ్యయం, ప్రాజెక్ట్ ఎప్పటిలోగా పూర్తవుతుందో తెలపాలని బుధవారం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకుగానూ స్పందించిన కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి, 7 సెప్టెంబర్ 2022న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పిఎంశ్రీ పేరుతో కొత్త కేంద్ర ప్రాయోజిత పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింద న్నారు. ఈ పాఠశాలలు జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 అమలును ప్రదర్శిస్తాయని, నిర్దిష్ట కాల వ్యవధితో పాటు ఆదర్శవంత మైన పాఠశాలలుగా అవతరిస్తా యని, ఇతర పాఠశాలలకు కూడా నాయకత్వం వహిస్తాయని తెలిపారు. అధిక నాణ్యత ఉన్న విద్యను అందించడంలో, వారి సంబంధిత ప్రాంతాలలో వారు నాయకత్వం వహించేలా సమానమైన, సంతోషకరమైన పాఠశాల వాతావరణంలో పిల్లల విభిన్న నేపథ్యం, బహుభాషా అవసరాలు, విభిన్న విద్యా సామర్థ్యాలను చూసుకుంటుందని తెలిపారు. ఎన్ఇపి 2020 దృష్టి ప్రకారం వారి సొంత అభ్యాస ప్రక్రియలో వారిని చురుకుగా పాల్గొనేలా చేస్తుందన్నారు. పిఎంశ్రీ పాఠశాలల ఎంపిక మొదటి దశలో మొత్తం 662 పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపిక చేయబడిన విషయం వాస్తవమే అని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : స్థానిక సాయినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పిడి హేనసుజన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి, కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పిల్లలకు ఎలా బోధిస్తుందో అని తనిఖీ చేశారు. అనంతరం కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు వస్తున్నాయని పేరెంట్స్ నుండి ఫిర్యాదులు అందడంతో ఆమె కోడి గుడ్లను పరిశీలించారు. నాసిరకమైన కోడి గుడ్లు వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం పొందాలన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

సయ్యద్ మెహరున్నీసా బేగం, భర్త కె.యం.ఫతేఖాన్ అలి, డోర్ నెం.26-11-276,భగత్‌సింగ్ కాలనీ, వెంకటేశ్వర పురం, నెల్లూరు సిటీ. అను నేను నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టరు అయిన నాఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంట్లు నెం.14225/2008, 14205/2008 మరియు 4452/1996 ర్లు తేది:20-7-2023 న నర్తకి సెంటర్‌లోని జెరాక్స్ షాపు నుండి కనకమహల్ సినిమా హాల్ దగ్గరలోని బస్టాండుకు తీసుకుని పోవుచుండగా మార్గమధ్యలో జారి పడిపోయినవి. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల ఈక్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

సయ్యద్ మెహరున్నీసా బేగం, భర్త కె.యం.ఫతేఖాన్ అలి, డోర్ నెం.26-11-276, భగత్‌సింగ్ కాలనీ, వెంకటేశ్వర పురం, నెల్లూరు సిటీ. సెల్: 8143191082